# గులాబీ శ్రేణుల్లో జోష్

- బీఆర్ఎస్‌లోకి జోరుగా చేరికలు
- ప్రచారంలో దూసుకెళ్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి 'పాడి'
- గ్రామాలు.. పట్టణం కలియతిరుగుతున్న కౌశిక్‌రెడ్డి
- జమ్మికుంట పట్టణంలో ఎకరం స్థలంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు



ఇటీవల పార్టీలో చేరిన మడిపల్లి గౌడ సంఘం నాయకులు (ఫైల్)

జమ్మికుంట, అక్టోబర్ 22: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. గులాబీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. నోటిఫికేషన్ రాక ముందు నుంచే బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలను నేరుగా కలుస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామాలు, పట్టణమంతా ప్రతిరోజూ కలియతిరుగుతున్నారు. ఇదిలా ఉంటే.. ఇప్పటి వరకు ప్రతిపక్షాల పార్టీలు తమ అభ్యర్థులనే ప్రకటించలేదు. ఇప్పటికే 'పాడి' అన్ని వర్గాలను ఒకసారి కలిశారు. అయినా కూడా తన దూకుడును కొనసాగిస్తున్నారు. దీంతో కౌశిక్‌రెడ్డి ప్రచారం ముందు ప్రతిపక్షాలు బేజారులో ఉన్నాయని సర్వత్రా చర్చ సాగుతున్నది.

**నాడు వినాయకుడు.. నేడు దుర్గామాత వద్దకు...**

పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వాడవాడనా భక్తులు గణనాథుడి విగ్రహాలను నెలకొల్పారు. దీన్ని గుర్తించిన మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ప్రతి వినాయక మండపం వద్దకు వెళ్లారు. నిర్వాహకులకు కలిశారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయా నిర్వాహకులు, అర్చకులతో ఆశీర్వచనాలు తీసుకున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇదే సందర్భంలో అన్ని దుర్గామాత మండపాలను బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు..**

సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో, స్వరాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులైన బీజేపీ, కాంగ్రెస్, పలు కుల సంఘాల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఇటీవల పాపక్కపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, మడిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, గౌడ సంఘం అధ్యక్షుడు కొండపాక రమేశ్, సంఘం నాయకులు, సభ్యులంతా పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లోకి వచ్చారు. అంతేకాకుండా ఉద్యమకారులు, ఈటల ప్రధాన అనుచరులు, బీజేపీ యువ నాయకులు జువ్వాజీ కుమార్(జేకే), మహ్మద్ జానీ ఆధ్వర్యంలో వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాలకు చెందిన వంద మంది గులాబీ గూటికి చేరారు.



పార్టీ కార్యాలయం

**ఎకరం స్థలంలో పార్టీ కార్యాలయం**

రానున్న ఎన్నికల సందర్భంగా ప్రతి నాయకుడు, కార్యకర్తను కలిసేందుకు జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల( వీణవంక ప్రధాన రోడ్డు, రిలయన్స్ పక్కన)ముందు ఎకరం స్థలం, మూడు అంతస్థుల భవనాన్ని పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల అద్దెకు తీసుకున్నారు. వాహనాలు నిలుపుకొనేందుకు స్థలాన్ని చదును చేయించారు. వందల మందితో నిత్యం సమావేశమయ్యేలా హాల్, స్థలం రెడీ అయ్యింది. రాత్రుళ్లు, పొద్దంతా పార్టీ కార్యాలయానికి వచ్చే ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ కార్యాలయం ఈ నెల 27న ప్రారంభించేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.

## ఖాదీ వస్త్రాల కొనుగోళ్లపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, అక్టోబర్ 22: దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో ఖాదీ వస్త్రాల కొనుగోలుపై 40శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ భిక్షపతి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నవంబర్ 15వ తేదీ వరకు ఈ తగ్గింపు ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

## కేంద్రప్రభుత్వం బీసీ గణన చేపట్టాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

తెలంగాణచౌక్, అక్టోబర్ 22: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా బీసీ గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. నగరంలోని శ్రీనివాస హోటల్‌లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు కనకయ్య గౌడ్‌తో కలిసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం పార్లమెంట్‌లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. బిల్లులో బీసీ మహిళల వాటా ఎంతో ప్రకటన చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జన గణన చేస్తామని హామీ ఇస్తున్న రాహుల్ గాంధీ టీపీసీసీ కార్యాలయం గాంధీ భవన్‌ను మాత్రం రెడ్డి భవన్‌గా మార్చారని విమర్శించారు. ఈ నెల 29న హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో సంఘ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్, కలర్ సత్తన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, రమేశ్, రాకేశ్‌చారి, మంతెన కిరణ్, బ్రహ్మాచారి, రామ్మూర్తి గౌడ్ పాల్గొన్నారు.

## రూ.2.50లక్షల నగదు పట్టివేత

- కారులో తరలిస్తుండగా జిల్లెల్ల చెక్‌పోస్టు వద్ద పట్టివేత



నగదు సీజ్ చేసి వివరాలు నమోదు చేసుకుంటున్న ఎన్నికల అధికారులు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 22: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని చెక్‌పోస్టులో నగదు పట్టుబడింది. సిరిసిల్ల పట్టణానికి చెందిన అల్లాడి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి వేళ జిల్లెల్ల చెక్‌పోస్టులో ఎన్నికల అధికారులు, పోలీసులు సదరు వాహనాన్ని తనిఖీ చేయగా, రూ.2.50లక్షల నగదు పట్టుబడింది. సంబంధించిన పత్రాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి, ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాస్ తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

## పండుగకు వస్తూ.. మృత్యుఒడిలోకి..

- పద్మనగర్‌లో రోడ్డు ప్రమాదం
- స్కూటీని ఢీకొట్టిన వ్యాన్
- అక్కడికక్కడే యువకుడి మృతి..మరొకరికి తీవ్రగాయాలు



అనిల్ (ఫైల్)

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 22: దసరా పండుగ కోసం ఓ యువకుడు స్కూటీపై ఇంటికి వస్తుండగా, వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పండుగ పూట జరిగిన ఈ ఘటన కార్మిక క్షేత్రంలో విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్లలోని బీవైనగర్‌కు చెందిన పిక్క అనిల్ (26) గజ్వేల్‌లోని న్యూరో దవాఖానలో మేనేజ్‌మెంట్ వర్క్ చేస్తూ, అక్కడే ఉంటున్నాడు. దసరా పండుగ కోసం గజ్వేల్ నుంచి ఆదివారం స్కూటీపై ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన స్నేహితుడు పిట్ల ఆంజనేయులు(25) కలిసి సిరిసిల్లకు బయలుదేరాడు. మార్గమధ్యంలో పద్మనగర్ శివారుకు చేరుకోగానే, ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ వీరిని ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, స్థానికులు గమనించి 108లో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. అనిల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆంజనేయులుకు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. అనిల్ మృతి చెందడంతో పండుగపూట విషాదం నెలకొన్నది. అనిల్ బావ గొరిట్యాల భూమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## బీఆర్ఎస్వీ నాయకుడిని పరామర్శించిన వినోద్ కుమార్



బీఆర్ఎస్వీ నాయకుడిని పరామర్శిస్తున్న వినోద్ కుమార్

కార్పొరేషన్, అక్టోబర్ 22: గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన జిల్లా బీఆర్ఎస్వీ నాయకుడు సముద్రాల ఓంకార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇక్కడ బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజ్ యాదవ్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ద్యావ మధుసూదన్ రెడ్డి, సాయి, వేణు, సాజిద్ ఖాన్, మాజీ సర్పంచ్ నాగరపు సత్యనారాయణ, మధు అనిల్, సన్నీ, ఈశ్వర్, అరుణ్ తదితరులున్నారు.

## పొట్లపల్లి ఆలయంలో వృద్ధుల పూజలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 22 : జిల్లా కేంద్రంలోని వాసవీ వృద్ధాశ్రమానికి చెందిన వృద్ధులు ఆలయ చైర్మన్ చిట్టుమల్ల కొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం పొట్లపెల్లి స్వయంభూ శ్రీరాజరాజేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ ఈవో పీచర కిషన్ రావు సత్కరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

లీజుకు ఇవ్వబడును

★ రామడుగు మండలం, తిర్మలాపూర్ గ్రా||లోని 2 Ton మిని రైస్‌మిల్లు అధునాతన టెక్నాలజీ కలిగిన మిషన్లు మరియు స్వంత ట్రాన్స్‌ఫారంతో 24 గంటల కరెంటు సదుపాయం ఉన్న మిని రైస్ మిల్లు లీజుకు ఇవ్వబడును. సంప్ర|| 9573447501. కాటం శ్రీనివాస్ రెడ్డి, నందగిరి.
NTK-322300

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194